క్లుప్తంగా

నీలమణిదుర్గ సన్నిధిలో సామవేదం



అమ్మవారిని దర్శించుకుంటున్న సామవేదం షణ్ముఖశర్మ

పాతపట్నం: మండల కేంద్రంలోని నీలమణి దుర్గమ్మను సామవేదం షణ్ముఖశర్మ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది గౌరవ స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. అర్చకుడు సంతోష్ ఆచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. దుక్క శ్రీకాంత్, శాసనపూరి మధుబాబు, పారశెల్లి రామరాజు, తారకేశ్వరరావు, నల్లి రాజారావు, ఆంజనేయులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జనార్దనరావు

ఆమదాలవలస: మండలంలోని అక్కులపేట బస్ షెల్టర్‌లో వేణమ్మపేట–అక్కులపేట సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆ సంస్థల జోనల్ కన్వీనర్ ఎం.జనార్దనరావు ప్రారంభించారు. మజ్జిగను జిల్లా జాయింట్ యూత్ కో ఆర్డినేటర్ సాయికృష్ణ సమకూర్చారు. జోనల్ యూత్ కో ఆర్డినేటర్ పవన్, సమితి యూత్ కో ఆర్డినేటర్ గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

అక్కివలసలో పల్లకీ సేవ



నగర సంకీర్తన నిర్వహిస్తున్న సత్యసాయి భక్తులు

సారవకోట: మండలం అక్కివలసలో ఆదివారం సత్యసాయి బాబా పల్లకీ సేవ నిర్వహించారు. కోటబొమ్మాళి సమితి ఆధ్వర్యంలో భక్తులు ర్యాలీ చేపట్టారు. అనంతరం నగర సంకీర్తన, సత్సంగం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి బాబా సేవా సమితి జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు, ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

విస్తృత తనిఖీలు



డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపడుతున్న సిబ్బంది

పోలాకి: మండల కేంద్రంలో గంజాయి నిల్వలను గుర్తించేందుకు పోలీసులు ఆదివారం డాగ్ స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలు చేపట్టారు. దాదాపు 20 దుకాణాల్లో తనిఖీలు చేశారు. ఎస్‌ఐ రంజిత్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా గురుకుల సమన్వయాధికారి బాలాజీ

పాతపట్నం: మండలంలోని ప్రహరాజపాలెంలో గల డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఆదివారం ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. పరీక్ష కేంద్రాన్ని జిల్లా గురుకుల సమన్వయాధికారి ఎస్.బాలాజీ పరిశీలించారు. ఈ పరీక్ష కేంద్రంలో 326 మంది విద్యార్థులకు 281 మంది హాజరయ్యారు. ఇంటర్మీడియెట్ ప్రవేశ పరీక్షకు 13 మంది, 5వ తరగతి ప్రవేశ పరీక్షకు 32 మంది గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ వి.అర్చన తెలిపారు.

కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

హిరమండలం: స్థానిక కామాక్షి స్వర్ణకార సేవా సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా మల్లవరపు హరిబాబు, ఉపాధ్యక్షుడిగా పోలాకి సురేష్, కార్యదర్శిగా మల్లవరపు ప్రసాదరావు, సంయుక్త కార్యదర్శిగా పుల్లెటికుర్తి చక్రధర్, కోశాధికారిగా బండారు రాజ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడిగా పల్లేటికుర్తి వెంకటరమణను ఎన్నుకున్నారు. స్వర్ణకారుల అభివృద్ధికి తమ వంతు కృషిచేస్తామని సంఘం సభ్యులు తెలిపారు.

నిరుపేదలకు వరం.. కేజీబీవీలు..

- ఉత్తమ బోధన, వసతి
- ఈ నెల 21వ తేదీ వరకు దరఖాస్తుకు గడువు పెంపు
- ఎంపికైన వారికి 6 నుంచి ఇంటర్ వరకు ఉచిత విద్య



హిరమండలం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం

హిరమండలం: ఉత్తమ బోధన.. నాణ్యమైన వసతికి కేరాఫ్ అడ్రాస్‌గా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు నిలుస్తున్నాయి. నిరుపేద విద్యార్థినులు, తల్లిదండ్రులను కోల్పోయిన అనాథులు, ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఉన్నత చదువులు చదవడానికి బాసటగా నిలుస్తున్నాయి. ఈ విద్యాలయాల్లో రానున్న విద్యా సంవత్సరం 2025–26కు సంబంధించి దరఖాస్తుల ప్రక్రియ ఇప్పటికే ప్రారంభంకాగా.. ఈ నెల 11వ తేదీతో గడువు ముగిసింది. ప్రభుత్వం మరలా ఈ నెల 21వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు పెంచింది.

హిరమండలంలో..

హిరమండలంలోని కేజీబీవీలో ఏటా 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరంలో బైపీసీ గ్రూప్‌లో 40 సీట్లు చొప్పున ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థినులను ప్రభుత్వ నిబంధనల మేరకు ఎంపిక చేస్తారు. ఎంపికైనవారు 6వ తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు (7 సంవత్సరాలు) ఉచిత విద్యతోపాటు వసతి సౌకర్యం కల్పిస్తున్నారు. ప్రతీ సంవత్సరం అన్ని తరుగతులు కలిసి 280 మంది ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు.

శత శాతం ఉత్తీర్ణత..

ఇక్కడ పదో తరగతిలో విద్యార్థినులు శత శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారు. జిల్లాలోని కేజీబీవీల్లో శత శాతం ఫలితాలతోపాటు ఉత్తమ ఫలితాలు అందిస్తున్నారు. ఇంటర్మీడియెట్‌లో 90 శాతానికి పైగా ఉత్తీర్ణత సాధిస్తున్నారు.

ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం..



ఈ నెల 21తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం గడువు పెంచింది. ఇంకా ఎవరైనా దరఖాస్తు చేసుకోని విద్యార్థునులు ఉంటే సద్వినియోగం చేసుకోవాలి. అన్ని తరగతుల్లోనూ చదువులో వెనుకబడిన విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధచూపి వారిని కూడా తీర్చిదిద్దుతున్నాం. ఏటా శత శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు, అధ్యాపకులు కృషి చేస్తున్నారు.

– ఎస్.కృష్ణవేణి, ప్రత్యేకాధికారి, కేజీబీవీ, హిరమండలం

రబీ ధాన్యం కొనుగోలు చేసేదెప్పుడు?



సారవకోటలో జాతీయ రహదారికి పక్కన ఇతర జిల్లాలకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యం బస్తాలు

సారవకోట: ఈ ఏడాది రబీ సీజన్‌లో మండలంలోని పలు గ్రామాల్లో పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఎప్పుడు కొనుగోలు చేస్తుందా అని రైతులు ఎదురుచూస్తున్నారు. ఖరీఫ్‌లో పండించిన ధాన్యం పూర్తిస్థాయిలో కొనుగోలు చేయకపోవడంతో.. చాలా మంది రైతులు వ్యాపారులకు తక్కువ రేటుకు విక్రయించుకున్నారు. కొన్ని గ్రామాల్లో ఇప్పటికీ సాంబ రకం ధాన్యం రైతులు వారికున్న ఇళ్లు, చిన్న గొడౌన్లలో నిల్వ చేసుకున్నారు. రబీలో సారవకోట, జగ్గయ్యపేట, బురుజువాడ, కొత్తూరు, గోపాలపురం, బద్రి, అగదల, రైవాడ, లక్ష్మీపురం తదితర గ్రామాల్లో సుమారు వెయ్యి ఎకరాలలో వరి సాగు చేశారు. నీరు లేక పోయినా సమీపంలో ఉన్న చెరువుల నుంచి ఇంజిన్లతో నీటిని పెట్టి పంట పండించుకున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో వ్యాపారులకు విక్రయిస్తున్నారు. మండలంలోని ధాన్యాన్ని ఇతర జిల్లాలకు చెందిన వ్యాపారులు వచ్చి కొనుగోలు చేసుకుని లారీల్లో తరలిస్తున్నారు.

ఒడియా టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేస్తున్న విశ్వనాథ్ బరోడా

పాతపట్నం: ఏపీ ఒడియా ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి ఒడియా టాలెంట్ టెస్ట్ (మేధా సమ్మాన్ టెస్ట్)లో ముగ్గురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ విషయాన్ని ఏపీ ఒడియా ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు విశ్వనాథ్ బరోడా తెలిపారు. మండలంలోని బూరగాం ఒడియా యూపీ పాఠశాలలో ఏపీ ఓటీ ప్రధాన కార్యదర్శి ప్రహల్లాద పుల్లాయ్ పర్యవేక్షణలో మండలంలోని ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఒడియా మాధ్యమంలో జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విశ్వనాథ్ బరోడా పరీక్ష పేపర్లను విడుదల చేశారు. ఉపాధ్యాయులు భీమ్‌సేన్ పండా, గణేష్ బరోడా, ఎ.జనార్దనరావు, వినోదినిదేవి, హరి బిశ్వాల్, మోనిషా జెన్నా, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

ఆమదాలవలస: మండలంలోని వంజంగి గ్రామంలో రామాలయ పునర్ నిర్మాణం పురస్కరించుకుని సీతారాముల కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ప్రముఖ జ్యోతిష్యులు, బ్రహ్మశ్రీ డాక్టర్ షణ్ముఖ శర్మ ఆధ్వర్యంలో వంజంగి గ్రామ పురోహితులు నంబూరి తాతాచార్యులు పర్యవేక్షణలో ఆలయ పునర్ ప్రారంభ కార్యక్రమాలను శుక్రవారం నుంచి ఆదివారం వరకు నిర్వహించారు.

అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయ పునర్ నిర్మాణ కర్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఆమదాలవలస జెడ్పీటీసీ సభ్యుడు బెండి గోవిందరావు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

లోక రక్షకుడు ఏసుక్రీస్తు



ఆమదాలవలస: ఊరేగింపులో పాల్గొన్న క్రైస్తవులు, సంఘ నాయకులు

నరసన్నపేట: స్థానిక కల్వరి బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో ఆదివారం ఏసుక్రీస్తు జయ ప్రవేశ కార్యక్రమం (మట్టల ఆదివారం) నిర్వహించారు. గుడ్ ఫ్రైడే ముందు వచ్చే ఆదివారం ఈత మట్టలకు పూలతో అలంకరించి మట్టల ఆదివారాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. దీంట్లో భాగంగా చర్చి పాస్టర్ జాన్ డేవిడ్ ఆధ్వర్యంలో లోక రక్షకుడైన ఏసును కీర్తిస్తూ స్థానిక వీధుల్లో అలంకరించిన ఈత మట్టలను పట్టుకొని ఊరేగింపు నిర్వహించారు. మట్టల ఆదివారం ప్రాధాన్యతను డేవిడ్ వివరించారు. రత్నకుమారి, సంఘ యూత్ కన్వీనర్ ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.



నరసన్నపేట: మట్టలతో ఊరేగింపు నిర్వహిస్తున్న క్రైస్తువులు

ఆమదాలవలసలో..

ఆమదాలవలస: మట్టల ఆదివారం పురస్కరించుకుని పట్టణ శివార్లలోని ఓవర్ బ్రిడ్జి నుంచి ప్రధాన రహదారిలో క్రైస్తువులు ఊరేగింపు నిర్వహించారు. గేటు ప్రాంతంలో మానవహారం చేపట్టి సువార్త కార్యక్రమం నిర్వహించారు. పాస్టర్ రాడ విజయ్‌కుమార్, సంఘ పెద్దలు, సభ్యులు పాల్గొన్నారు.

• పేరుకుపోయిన మురుగు



రోడ్డుపై కట్టిన ఆవు, (ఇన్‌సెట్‌లో) పేరుకుపోయిన మురుగు

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధి డాబాలవారి వీధిలోని కాలువల్లో మురుగు పేరుకుపోయింది. ఈ వీధిలో నివాసముంటున్న ప్రజలు దుర్వాసనతో అవస్థలు పడుతున్నారు. దోమలు, ఈగల వృద్ధి చెంది వ్యాధుల బారీన పడుతున్నారు. పారిశుద్ధ్య పనులు సరిగా నిర్వహించడం లేదని, వీధిలో పశువులు ఎక్కువగా ఉండడంతో పేడను కాలువల్లో వేస్తున్నారని ఆ వీధి వాసులు తెలిపారు. మున్సిపల్ అధికారులు స్పందించి కాలువలను శుభ్రం చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

సారవకోట: మండలంలోని చీడిపుడి వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన రావాడ దేవి ప్రసాద్‌కు గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనంతో వెళ్తున్న దేవిప్రసాద్.. కంకర దిబ్బను ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది గాయపడిన వ్యక్తిని శ్రీకాకుళంలోని రిమ్స్‌కు తరలించారు.

నేడు అంబేడ్కర్ జయంతి

ఆమదాలవలస: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతిని సోమవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

ఘనంగా బంగారమ్మ విగ్రహ ప్రతిష్ట



హోమం నిర్వహిస్తున్న భక్తులు

పాతపట్నం: మండలంలోని కొరసవాడ గ్రామంలో గల బంగారమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించారు. కొరసవాడ, కాగువాడ, బూరగాం, పాతపట్నం, తదితర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

పీఆర్సీ ప్రకటించాలి

ఆమదాలవలస: రాష్ట్రం ప్రభుత్వం వెంటనే 12వ పీఆర్సీని ప్రకటించాలని, ఐఆర్ 30 శాతం ఇవ్వాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్దనరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని లక్ష్మీనగర్ వీధిలోని పాఠశాలలో సంఘం నాయకుడు సురవరపు సిమ్మినాయుడు అధ్యక్షతన ఆదివారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ పెన్షనర్లకు నష్టం చేకూర్చే బిల్లును (కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన) వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోశాధికారి హెచ్.వి.సత్యనారాయణ మాట్లాడుతూ 2018 జులై నుంచి డీఆర్ ఎరియర్స్, 11వ పీఆర్సీ బకాయిలు, 2024 నుంచి 2025 వరకు రావాల్సిన మూడు డీఆర్‌లు, చనిపోయిన పెన్షనర్ల కుటుంబాలకు దహన సంస్కారాల ఖర్చులను చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘ సభ్యులు జి.కృష్ణమూర్తి, కె.కోటేశ్వరరావు, ఆర్.సత్యనారాయణ, కె.షణ్ముఖరావు పి.భానోజీరావు, బి.వి.రమణ, కె.జనార్దనరావు, కె.సంజీవరావు, బెండి నారాయణరావు, బి.చిట్టయ్య, బలివాడ వెంకటరమణ, ఎస్.వాసుదేవరావు, బి.వి.మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం



విద్యుత్ స్తంభానికి దట్టంగా అల్లుకున్న తీగలు

మెళియాపుట్టి: మండలంలోని చాపర–మెళియాపుట్టి గ్రామాల మధ్య ఓ విద్యుత్ స్తంభానికి తీగలు అల్లకుని ప్రమాదకరంగా కనిపిస్తోంది. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే రహదారిలో ఇలా ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం కనిపిస్తుండటంతో ప్రమాదం పొంచి ఉంది. ఇదే ప్రాంతంలో పోలీస్ స్టేషన్, ప్రభుత్వ కళాశాల ఉండటంతో అధికంగా విద్యార్థులు, ప్రజలు వస్తుంటారు. విద్యుత్ శాఖ సిబ్బంది దీనిపై దృష్టి సారించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

కూలేందుకు సిద్ధంగా..



ఆమదాలవలస పట్టణంలోని శివారులో గల వెంగళరావు కాలనీ రహదారి పక్కనే ఉన్న రక్షిత మంచినీటి పథకం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఈ రహదారిలో బిక్కుబిక్కుమంటూ ప్రయాణం చేస్తున్నారు. ఇదే రహదారిలో మండలంలోని కనుగులవల, తమ్మయ్యపేట, కంచరాపువానిపేట, ముద్దాడపేట, పిరుసాహెబ్‌వానిపేట తదితర గ్రామాల ప్రజలు, విద్యార్థులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శిథిలమైన మంచినీటి పథకాన్ని తొలగించాలని పలువురు కోరుతున్నారు.

– ఆమదాలవలస రూరల్

నేత్ర చికిత్సలకు 41 మంది ఎంపిక



సారవకోట మండలంలోని అలుదు పాఠశాల ఆవరణలో వరుదు పరిమళ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 70 మందికి శంకర్ ఫౌండేషన్ వైద్యులు కంటి తనిఖీలు నిర్వహించి మందులు అందజేశారు. 41 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. శంకర్ ఫౌండేషన్ వైద్యులు అంజలి, ట్రస్టు ప్రతినిధి వరుదు వంశీకృష్ణ, సర్పంచ్ సాగిపల్లి దండాసి, తదితరులు పాల్గొన్నారు.

– సారవకోట

తుప్పపట్టాయి



నరసన్నపేట మండలం మడపాం పంచాయతీలో చెత్త సేకరణ కోసం మంజూరైన రిక్షాలు వినియోగించకపోవటంతో తుప్పుపట్టాయి. గత ప్రభుత్వ కాలంలో మంజూరు చేసిన రిక్షాలను ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత వినియోగించడం లేదు. ఈ రిక్షాలు సచివాలయం వద్ద దర్శనమిస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రం ముందు ఒక రిక్షా తుప్పుపట్టి పాడైంది. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– నరసన్నపేట

అవస్థలు



సారవకోట మండలంలోని కేళవలస పంచాయతీ పద్మాపురంలో మురుగు నీటి కాలువలు లేక గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. ప్రధాన వీధిలోని ఇళ్లల్లో వినియోగించే నీరు రోడ్డుపైకి చేరుతుంది. మురుగునీరు వెళ్లేందుకు స్థానికులే చిన్న, చిన్న గొయ్యిలు తీసుకున్నారు. చిన్న వర్షం పడినా.. మురుగునీటితోపాటు వర్షం నీరు రోడ్డుపై నిల్వ ఉంటుంది. దోమలు, ఈగలు వృద్ధి వ్యాధుల బారీన పడుతున్నామని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– సారవకోట

చెరువు గట్టు ఆక్రమణ



ఆక్రమణలకు గురవుతున్న గట్టు

నరసన్నపేట: జాతీయ రహదారికి ఆనుకొని నరసన్నపేట డంపింగ్ యార్డ్ సమీపంలో ఉన్న బుచ్చన్న బంద (చెరువు) ఆక్రమణకు గురవుతోంది. గతంలో ఉపాధి నిధులతో నిర్మించిన గట్టును కొందరు రైతులు ఆక్రమించుకుంటున్నారు. వారి పొలాల్లో గట్టును కలిపివేస్తున్నారు.

ఇప్పటికే గట్టులో సగ భాగంలో తవ్వి మట్టిని తరలించారు. రెవెన్యూ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అపూర్వ కలయిక.. ఆనంద వేడుక



మెళియాపుట్టి గ్రామ కుటుంబ సభ్యులు సందడి

సీతమ్మధార: హలో బాబు ఎలా ఉన్నావు.. హాయ్ మురళీ, బుజ్జి, సురేష్ బాగున్నారా.. ఇప్పుడు ఏం చేస్తున్నావ్.. అంటూ విశాఖలోని గాయత్రీ టవర్స్‌లో శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి గ్రామస్తులు కుటుంబ సమేతంగా ఆత్మీయంగా పలకరించుకున్నారు. చదువుకున్న రోజుల్లో పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఎవరు ఏ వృత్తిలో స్థిరపడ్డారో తదితర విషయాలను పంచుకున్నారు. నగరంలో ఉన్న 200 కుటుంబాలు కలిసి సందడి చేశాయి.

చిన్నారులు నృత్యం చేస్తూ సందడి చేశారు. పెద్దలు కుర్చీ ఆటలు, జల్‌దిఫైప్ , పెద్ద డాన్స్‌లు వేశారు. జోక్స్ చెబుతూ అందరిని నవ్వించారు. రోజంతా కబుర్లు చెప్పుకుని ఆనందంగా గడిపారు. చిన్నారులు పాటలు పాడి ఆకట్టుకున్నారు. ఆటలు పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆమదాలవలస/ పాతపట్నం: 9010177724, 7075499517
నరసన్నపేట: 9912220367
Office mail : sklmadvt@gmail.com